**జరిగిన కథ :** తాళధ్వజుని కుమారులు ఉత్తర దిగ్విజయ యాత్రలు చేసి వస్తూ.. సుడిగాలిలో చిక్కుకున్నారు. రాకుమారుల్లో ఒకడైన విద్యాసాగరుడు సుడి గాలి తాకిడికి కొట్టుకుపోయి, ఒక కోట గోడ పక్కన పడ్డాడు. ఆ గోడ దాటివెళ్తే.. కాశ్మీరరాజు తన కూతురి కోసం కట్టిన భవనం కనిపించింది. అక్కడివారంతా విద్యాసాగరుణ్ని స్త్రీలా సంబోధించడం వింత గొలిపింది. ఆ వనంలో పురుషుల తోడులేకుండా ఆ స్త్రీలు నివసించడానికి గల కారణాన్ని ఓ వృద్ధ ఉపాధ్యాయు రాలు విద్యాసాగరునితో చెబుతున్నది.






# మహిళారాజ్యంలో మగధీరుడు - 2

అనుసృజన:
**నేతి సూర్యనారాయణ శర్మ**

ఆ మాటలు విన్న శ్రీవర్ధనుడు మొదట కొంచెం కంగారు పడ్డాడు.

''మిత్రమా! నీ కోరిక విడ్డూరంగా ఉంది. పురుష శబ్దమే తెలియకుండా పెరిగిన ఆడపిల్లకు లోక జ్ఞానం ఉండదు. అటువంటి పిల్లను పెళ్లాడినవాడికి ఏం ఆనందం కలుగుతుంది?'' అని ప్రశ్నించాడు.

కానీ, నేపాళరాజు అందుకు ఒప్పుకోలేదు.

''శ్రీవర్ధనా! స్త్రీల విషయంలో నాకు కలిగిన అనుభవాలు నీకు తెలియవు. పురుష సహవాసం వల్ల కన్యలకు కామాది దుర్గుణాలు అలవడతాయి. ఒకసారి అలవాటైన గుణాన్ని పోగొట్టుకోవడం ఎంతటి పతివ్రతకైనా సాధ్యం కాదు. అందుకే నాకు కాబోయే కోడలు పెళ్లి వరకు ఏ పురుషుణ్నీ చూడకూడదని కోరుకుంటున్నాను. స్త్రీలకు మొదటిసారిగా చూసిన పురుషునిపైనే సహజమైన అనురాగం కలుగుతుంది. అటువంటి అనురాగవతి అయిన స్త్రీతో జీవితం మధురంగా ఉంటుంది. నీ కూతురిని అలాంటిదానిగా చేయగలిగితే.. నా కొడుక్కి చేసుకుంటాను. లేదంటే ఈ సంబంధమే వద్దు'' అన్నాడు.

''సరే మిత్రమా! నువ్వు కోరినట్లే చేస్తాను'' అని మాటిచ్చాడు శ్రీవర్ధనుడు.

ఈ మహారణ్యం కాశ్మీరానికి ఉత్తరభాగంలో ఉంది. దీనికి చుట్టూ ఎత్తయిన ప్రహరీ పెట్టించాడు శ్రీవర్ధనుడు. పడమటి వైపు మాత్రమే నిగూఢమైన ద్వారం ఉంది. ఈ వనంలో అనేక విచిత్ర భవనాలున్నాయి.

ప్రమద్వరకు మూడేళ్లు దాటిన వెంటనే, ఆమె ఈడుకు తగిన వందమంది స్నేహితులతో కలిపి.. కొంతమంది దాసీజనంతోనూ ఇక్కడ ప్రవేశపెట్టాడు. వీళ్లందరికీ నన్ను ఉపాధ్యాయురాలిగా నియమించాడు. నేను ఈ కోటకు రక్షకురాలిని కూడా! రాజధాని నుంచి శ్రీవర్ధనుడు పంపే సంబారాలు స్వీకరించడానికి, ఇక్కడి వార్తలు ఆయనకు తెలియచేయడానికి నాకు మాత్రమే అధికారాలు ఉన్నాయి. నేను నా విధులను అతిరహస్యంగా నిర్వర్తిస్తూ ఉంటాను. ప్రమద్వరకు నేటివరకూ.. లోకంలో మగజాతి అనేది ఒకటి ఉంటుందని కూడా తెలియదు. అవతల వసుప్రియుని కుమారుడు ఈమెను పెళ్లాడటానికి ఉర్రూతలూగుతున్నాడట. రేపోమాపో వాళ్ల వివాహం కానున్నది. అప్పటివరకు మాత్రం ఆమె ముందు పురుషశబ్దమే పనికిరాదు. నువ్వు కూడా ఆమెతో అనరాదు.

ఇంతవరకూ కథ చెప్పిన ఉపాధ్యాయురాలు..

''అమ్మాయీ! ఇక నీ సంగతి చెప్పు. నువ్వు ఎవరి కూతురివి? అతి రహస్యమైన ఈ కోటలోకి ఎలా ప్రవేశించావు?'' అని ప్రశ్నించింది.

ఆమె మాటలకు విద్యాసాగరునికి ఆశ్చర్యం రెట్టింపయింది. ఇంత కథ చెప్పిన తరువాత కూడా ఆ వృద్ధురాలు తనను ఆడదానిగానే సంబోధించడం వింతగా అనిపించింది.

'సరే.. నేను బయటపడటం ఎందుకు?' అని మనసులో అనుకున్నాడు.

''అవ్వా! మాది దక్షిణ దేశం. నేను క్షత్రియ వంశంలో జన్మించాను. అశ్వారోహణం మొదలైన వీరధర్మాలలో నాకు గొప్ప పాండిత్యం కుదిరింది. నేను నా గుర్రమెక్కి దేశదేశాలూ తిరుగుతుండగా ఈ కోటగోడ కంటపడింది. ఇవతల ఏముందో చూడాలనే వేడుకకొద్దీ నా గుర్రాన్ని కోటగోడ దూకించి, దాని ప్రాణాలు పోగొట్టాను. తరువాత మీ రాకుమారి కనిపించి నన్ను ఇక్కడికి తీసుకొచ్చింది'' అని చెప్పాడు.

'ఊ.. హూ..' అని తలాడిస్తూ.. అతడు చెప్పిన మాటలను ఆలకిస్తున్నది ఆ ఉపాధ్యాయురాలు.

''అవ్వా! నీకు తెలియని ధర్మాలుండవు. స్త్రీలకు కోటలు, అగడ్తలు, శుద్ధాంతఃపురాలు.. చివరికి వస్త్రాలు కూడా ఆవరణలు కానేకావు. వ్యక్తిత్వం కలిగినవారు ఇవేమీ లేకపోయినా తమను తాము అదుపులో పెట్టుకోగలరు. మంచి గుణం లేనప్పుడు ఇవేమీ వారిని కాపాడలేవు. ఆ నేపాళరాజు కోరిక విడ్డూరమే కాకుండా ధర్మ విరుద్ధమని నా అభిప్రాయం. ఏమంటావు?'' అన్నాడు విద్యాసాగరుడు.